# అంతరంగయాత్ర

ANTHARANGA YATRA

KRISHNAMURTI FOUNDATION INDIA AUGUST 2014 - NOVEMBER 2014 Rs. 2/- VOL. IX ISSUE 1

జె. కృష్ణమూర్తి బోధనలతో కూర్చిన ప్రచురణ


## మన హృదయాలు మారిపోతాయి

**ఇచ్చేవారూ, పుచ్చుకొనేవారూ లేనటువంటి ఆ ప్రేమ**

మనం అందరం కలిసి ఒక ప్రయాణం చేస్తే, ఒక తీర్థయాత్రను చేస్తే, లోపల ఏ ఉద్దేశ్యమూ లేకుండా, ఏ ప్రయోజనము అశించకుండా, దేనికోసమూ అన్వేషిస్తూ కాకుండా కనుక ఈ ప్రయాణం చేశామంటే, తిరిగి వచ్చాక మనకు తెలియకుండానే మన హృదయాలు మారిపోయాయని బహుశ కనిపెడతామేమో. ఇది ప్రయత్నించి చూడడం మంచిదని నాకు అనిపిస్తున్నది. ఏ రకమైన ఉద్దేశ్యంకానీ, ఆశయంకానీ, ప్రయోజనాపేక్షకానీ, గమ్యంకానీ లోపల వుంటే ప్రయత్న ప్రయాసలు అక్కడ వున్నాయని అర్థం. వ్యక్తరూపంలోనో, అవ్యక్తంగానో ఒకటి సాధించాలనే, చేరుకోవాలనే ప్రయత్నం అందులో వుంటుంది. ఈ అంశాలు ఏవీ లేనటువంటి ప్రయాణాన్ని మనం కలిసి చేస్తే బాగుంటుందని నేను సలహా ఇవ్వాలనుకుంటున్నాను.

అటువంటి ప్రయాణం కనుక మనం చేస్తే, దారి పొడుగునా వున్న వాటిని పరిశీలించేటంత అప్రమత్తత కనుక మనం చూపుతే, యాత్రీకులంతా ఏదో ఒకనాడు వెనక్కి తిరిగి వచ్చినట్లే మనము తిరిగి వచ్చినప్పుడు, హృదయంలో మార్పు కలిగినట్లుగా మనం కనిపెడతాము. మనసుని భావనాజాలంలో ముంచెత్తడం కంటే ఇది ఎక్కువ ముఖ్యమైనదని నాకు అనిపిస్తున్నది. ఎందుకంటే మానవులని మూలమట్టంలో మార్చడం భావనల వలన ఏమాత్రం జరుగదు. నమ్మకాలు, భావనలు, ప్రభావాలు పైపై మనసుని, ఉపరితలాన్ని ఒక విధానానికి అనుగుణంగా సర్దుకొని పోయేటట్లు చేస్తే చేయవచ్చు. కాని మనం అందరం కలిసి ఏ ఉద్దేశ్యమూ పెట్టుకోకుండా ఒక ప్రయాణాన్ని కనుక చేశామంటే, ప్రయాణ మార్గంలో జీవితం యొక్క అద్భుతమైన వైశాల్యాన్ని, ఆ లోతును, ఆ సౌందర్యాన్ని వూరికే పరిశీలిస్తూ పోయామంటే, అప్పుడు ఆ పరిశీలనలో నుండి కేవలం సామాజికమైనదీ, పరిసరాలకి సంబంధించినదీ కానటువంటి, ఇచ్చేవారూ పుచ్చుకొనేవారూ లేనటువంటి ఒక ప్రేమ జనిస్తుంది. ఆ ప్రేమ ఒక అస్తిత్వస్థితి. అందులో కావాలి అని అడుగుతున్న ఏ కోరికలూ వుండవు. అందుచేత ఈ ప్రయాణాన్ని మనం కలిసి చేస్తున్నప్పుడు, మన నిత్య జీవితాల్లో వుండే విసుగు నిరాశలకంటే, ఖాళీతనమూ, నిస్పృహలకంటే ఎక్కువ ముఖ్యమైనదాని ఎడల బహుశ మనం జాగృతమవుతామేమో.

మనుష్యుల్లో చాలామంది తమ రోజువారీ జీవితాలను గడపడంలో క్రమక్రమంగా, నిరాశ నిస్పృహలకు లోనవుతారు. లేదా అర్థంలేని, లోతులేని ఉల్లాసాల్లో వినోదాల్లో ఆశలలో చిక్కుకొనిపోతారు. లేదా అన్నింటినీ కారణాలతో సమర్థించే హేతువాదంలోనో, ద్వేషాలు, సామాజిక సంక్షేమం మొదలైన వాటిలోనో పడి కొట్టుకొని పోతుంటారు. మనం కనుక మనలో ఒక సమూలమైన ఆంతరికమైన పరివర్తనను నిజంగానే తీసుకొని రాగలిగితే, మేధ గొణిగే సణుగుళ్ళచేత కలుషితమవని ప్రగాఢమైన హృదయంభావాలతో పరిపూర్ణమైన పరిపుష్ఠమైన జీవితం గడుపుతాము. అప్పుడు మన సంబంధ బాంధవ్యాలన్నింటిలోనూ మూర్తిగా వినూత్నమైన తీరులో ప్రవర్తించగలుగుతాము.

ఇప్పుడు నేను మీ ముందు పెడుతున్న ఈ ప్రయాణం చంద్రమండలం మీదకు కాదు. నక్షత్ర మండలాలకు కూడా కాదు. మనలోపల వున్న దూరాలకంటే ఆ నక్షత్రాలకి మనకీ మధ్యన వున్న దూరమే తక్కువ. మనల్ని మనం ఆవిష్కరించుకోవడం ఒక ముగింపు అంటూ లేనిది. దానికి నిరంతరమైన విచారణ కావాలి. పరిపూర్ణమైన దృష్టిగ్రాహ్యత అవసరం. ఎంపిక చేసుకోవడంలేని ఒక ఎరుక వుండాలి. వ్యక్తికి ప్రపంచానికి వున్న పరస్పర సంబంధంలో నిజంగా తలుపులను తెరవడం వంటిది ఈ ప్రయాణం. మన లోపల మనతో మనకి సంఘర్షణ వున్నది కాబట్టి ప్రపంచంలో సంఘర్షణలు వుంటున్నాయి. మన సమస్యలే, విస్తరించుకొనిపోయి ప్రపంచ సమస్యలు అవుతున్నాయి. మన లోపల మనం సంఘర్షించుకుంటూ వున్నంతవరకు ఈ ప్రపంచంలో నివాసం కూడా ఒక అంతులేని సమరంగా, విధ్వంసానికి, పతనానికి దారితీస్తున్న యుద్ధంగా వుండిపోతుంది.

అందుచేత మనల్ని అవగాహన చేసుకోవడం చివరలో వ్యక్తిగతమైన నిర్వాణం సాధించడం కోసం కాదు. మనకే ప్రత్యేకమైన ఒక స్వర్గాన్ని, ఒక బంగారు ఒంటిస్తంభం మేడని చేరుకొని, అక్కడ మన దేవుళ్ళతో, మన నమ్మకాలతో, మన భ్రాంతులతో కాలక్షపం చేయడానికి వుపయోగపడే ఒక మార్గం కాదు ఇది. కాకపోగా, మనల్ని మనం కనుక అవగాహన చేసుకోగలిగితే ప్రశాంతతకలిగి, అప్పుడు ఈ ప్రపంచంలో, కలుషితమైపోయిన, విధ్వంసపూరితమైన అమానుషంగా తయారయిన ఈ ప్రపంచంలో సవ్యంగా జీవించడం ఏదో మనకి తెలుస్తుంది.

నిజంగా చూస్తే లౌకిక ప్రపంచం అంటే ఏమిటి? అంటే నిస్సందేహంగా,

ధ్యానం అంటే జీవితం నుండి దూరంగా వెళ్ళిపోవడం కాదు. నిత్య జీవితంలో తనను తాను అర్థం చేసుకొనే ప్రక్రియ అది.

సంతృప్తిని సాధించడం, ఆస్తి, సంపద, అంతస్తు, అధికారం వంటి బాహ్యమైన విషయాలలోనే కాకుండా, ఆంతరికమైన విషయాలలో కూడా సంతృప్తి చెందడం. మనలో చాలామంది పైపై విషయాల స్థాయిలోనే తృప్తిపడిపోతుంటారు. ఒక కారు, ఒక ఇల్లు, ఒక తోట, ఒక బిరుదు వంటివి స్వంతం చేసుకోవడంలో సంతృప్తి చెందుతారు. మనకి స్వంతమైనవి వుండటం ఎంతో విపరీతమైన సంతృప్తిని మనలో కలిగిస్తుంది. వస్తువులని బాగా ఎక్కితక్కిగా లెక్కలేనన్ని సంపాదించాక, ఇక లోపల మరికొంత లోతయిన స్థాయిలో సంతృప్తికోసం ఆరాటపడతాం. సత్యం అనీ, దైవం అనీ, నిర్వాణం అనీ మనం పేర్లు పెట్టిన వాటికోసం వెదకడం ఆరంభిస్తాం. అయితే ఇప్పుడు కూడా మనలను ముందుకు తోస్తున్నది అదే ఒత్తిడి – సంతృప్తి చెందాలి, నెరవేరాలి అనే కోరిక. సెక్స్‌లోనూ, సామాజిక అంతస్థులలోనూ, వస్తువులని స్వంతం చేసుకోవడంలోనూ ఏ విధంగానయితే తృప్తి పొందాలి, తనివి తీరాలి అని అభిలషిస్తారో అదే రకంగా ఆధ్యాత్మికమైన విషయాల్లో కూడా సంతృప్తి పొందాలి అని మీరు కోరుకుంటూ వుంటారు.

'అంతేనా' అని దయచేసి అనకండి. తేలిగ్గా నెట్టి పారేయకండి. ఇది వింటూ వున్నప్పుడే మీకు చేతనయితే, సంతృప్తి చెందాలి అనే మీలోని కోరికను పరిశీలించండి. ఏ విధంగా మీరు సంతృప్తి పొందుతున్నారు అనే దానిని, మీలో చూసుకోగలిగితే కనుక మిమ్మల్ని మీరే చూసుకోనివ్వండి. మేధావంతుడయిన వ్యక్తికి అతడి తెలివైన భావాలు తృప్తినిస్తాయి. ఇది ఒక రకమైన ఆధిక్యభావాన్ని, తనకే తెలుసు అనే ఒక భావాన్ని కలుగజేస్తుంది. తనకే తెలుసు అనే ఈ భావం సంతృప్తిని ఇవ్వడం ముగిసిపోయినప్పుడు, ప్రతి ఒక్కదానినీ, ప్రతి ప్రతిపాదననూ, ప్రతి సిద్ధాంతాన్నీ, ప్రతి నమ్మకాన్నీ అతడు విశ్లేషించి చూసి, అన్నింటినీ మేధాపరంగా చీల్చి చెండాడేసి, అప్పుడిక ఇంతకంటే విశాలమైన, ప్రగాఢమైన తృప్తికోసం వెదకడం ఆరంభిస్తాడు. చాలా మతధర్మ పరుడుగా అయిపోతాడు. ఇప్పుడు అతడి సంతృప్తిమీద ఏదో ఒక మత వ్యవస్థ తన రంగుని పులుముతుంది.

అందుచేత బాహ్యమైన విషయాలతో అసంతృప్తి చెందినప్పుడు ఆధ్యాత్మిక విషయాలు అనబడేవాటితో తృప్తిపొందడం వైపు, మొగ్గడం ఆరంభిస్తాము. ఈ ఆధ్యాత్మికత అనే పదం చాలా వికృతంగా తయారయింది. ఆ మాట వింటేనే దొంగభక్తి అనే వాసన వస్తుంది. మహాపురుషులు అందరూ వారు వారు అలవరచుకున్న సద్గుణాలతో, వారు పడుతున్న ప్రయాసలతో, వారి నియమనిష్ఠలతో, వారి నిగ్రహాలతో, వారి వారి వైరాగ్యాలతో వారు వున్నా కూడా సంతృప్తి పొందాలి అనే రంగస్థలంలోనే ఇంకా రొట్టుమిట్టాడు తున్నారు. సంతృప్తి పొందాలి అని మనం కోరుకుంటున్నాము కాబట్టే మనల్ని క్రమశిక్షణలో పెట్టుకుంటున్నాం. అన్ని సంశయాలనూ నివృత్తిచేసి, చిరకాలం నిలిచిపోయే ఒక సంతృప్తి, ఒక ఫలతృప్తి అనేది దొరికితే బాగుండని ఆరాటపడతాం. మనలో చాలామందికి కావలసినది ఇదే. మాలో ఆధ్యాత్మికత వున్నది, మతాత్మకత వున్నది అని దీనినే అంటూ వుంటాం. తృప్తిఫలం కోసం మనం పడే ఆరాటానికి సత్యాన్వేషణ అనే పేరు పెడతాం. దేవాలయాలకీ, చర్చికీ వెళతాం. ఉపన్యాసాలు వింటాం. ఇటువంటి ప్రసంగాలనూ వింటాం. గీత, వుపనిషత్తులు, బైబిలు చదువుతాం. ఇవన్నీ కూడా ఏ ఒక్క ప్రశ్ననూ మిగల్చని ఆ విచిత్రమైన సంతృప్తి భావం పొందడం కోసంగాను చేస్తాం.

సంతృప్తి చెందాలని మనలో వున్న వాంఛే మనల్ని ధ్యానం అని అంటున్న దానివైపుగా, సద్గుణాలను అలవరచుకోవడం వైపుగా మరలిస్తుంది. సద్గుణాన్ని 'అలవరచుకోవడం' ఎట్లా చేస్తారో నాకు మాత్రం తెలియదు. వినయాన్ని అలవరచుకోవడం ఎట్లా సాధ్యమవుతుంది ? ప్రేమని అలవరచుకోలేము అని నిస్సందేహంగా చెప్పవచ్చు. అదుపు ఆజ్ఞల ద్వారా శాంతిని ఎప్పటికీ నెలకొల్పలేము. ఈ విషయాలు అన్నీ – అవి వుంటే వుంటాయి, లేకపోతే వుండవు. వినమ్రతను అలవరచుకునే మనిషి నిండా గర్వమే వుంటుంది. వినయంగా వుండటం ద్వారా ఒక సుస్థిరమైన సంతృప్తిని సాధించవచ్చుని అతడి ఆశ. అదేవిధంగా ధ్యానం ద్వారా నిర్ద్వంద్వమైన, అప్రమేయమైన, అజ్ఞాతమైనదానిని కనుగొనాలని మనం కోరుకొంటాం. కానీ ధ్యానం అనేది మన నిత్యజీవితంలో భాగం. అది మీరు గాలి పీలుస్తున్నప్పుడూ, ఆలోచిస్తున్నప్పుడూ, మీరు జీవిస్తున్నప్పుడే, మీలో కోమలమైన భావాలూ, పాశవికమైన భావాలూ కలుగుతున్నప్పుడు చేయవలసినది. నిజమైన ధ్యానం అంటే అదే. మీలో కొందరు మహాశ్రద్ధగా కష్టపడి సాధన చేస్తున్న ధ్యానవిధానానికి ఇది పూర్తిగా భిన్నమైనది.

మీరు అనుమతిస్తే, ఈ ధ్యానం అనే ప్రశ్నను గురించి నేను మాట్లాడాలను కుంటున్నాను. అయితే దయచేసి నా మాటల సమ్మోహంలో పడిపోవద్దు. వెంటనే ధ్యానిస్తూ వుండిపోకండి. నిజమైన ధ్యానం యొక్క అంతిమలక్ష్యం ఏదో దానిని కనిపెట్టితీరాలనే పట్టుదలలోకి పోకండి. నేను చెప్పబోతున్న ఈ ధ్యానానికి ఏ గమ్యమూ లేదు, అంతిమలక్ష్యం లేదు. ప్రేమకి ఒక గమ్యం వుండదు. ప్రేమ విజయవంతం అవదు. ప్రేమ మీకు బహుమతులూ ఇవ్వదు, శిక్షలూ విధించదు. ప్రేమ అంటే ఒక అస్తిత్వస్థితి. ఒక వుజ్వలమైన భావం. ప్రేమలోనే సద్గుణాలు అన్నీ వుంటాయి. ప్రేమస్థితిలో మీరు ఏంచేసినా సరే అక్కడ పాపం వుండదు. దుర్మార్గం వుండదు. వైరుధ్యం వుండదు. ప్రేమ లేనప్పుడు మనతో మనకే సమరం జరుగుతూ వుంటుంది. అందుచేత ఒకరితో ఒకరం కూడా యుద్ధం చేస్తూ వుంటాం. ప్రపంచంతో పోరాడుతూ వుంటాం. ప్రేమ ఒక్కటి మాత్రమే మనసులో సంపూర్ణంగా పరివర్తన తేగలుగుతుంది.

అయితే, మనలో చాలామందికి పరిచితమైన ధ్యానం కానీ, మనలో కొందరు సాధన చేస్తువున్న ధ్యానం కానీ నేను చెప్తున్న ధ్యానానికి పూర్తిగా భిన్నమైనవి. ముందుగా అది మనం పరీక్షించి చూద్దాం. మీరు చేస్తున్నదానిని సమర్థించనూ వద్దు.

ఏ సమస్యకు అయినా సరే సమాధానం అనేది వుండదు. ఆ సమస్యను అర్థం చేసుకోవడమే దాని పరిష్కారం.

నిరసించనూ వద్దు. కేవలం అందులో వున్న సత్యాన్ని, అందులో వున్న నిజానిజాలను చూద్దాం. ఈ ప్రయాణాన్ని అందరమూ కలసి చేస్తున్నాం. ప్రయాణం చేస్తున్నప్పుడు తప్పనిసరిగా, అత్యవసరమైన వాటిని మాత్రమే మనతోపాటుగా తీసుకొని వెళతాం. నేను చెప్తున్న ఈ ప్రయాణం చాలా వేగంగా జరుగుతుంది. మధ్యలో ఎక్కడా ఆగదు. స్థిరంగా ఏ ప్రదేశంలోనూ వుండము. విశ్రాంతీ వుండదు. ఇది ఒక అంతులేని చలనం. బరువులు మోస్తూ భారంగా వున్న మనసు ఈ ప్రయాణం స్వేచ్ఛగా చేయలేదు.

మీలో చాలామంది సాధన చేసే ఆ ధ్యానం అంటే ఏకాగ్రత అనే ప్రక్రియ. ఈ ఏకాగ్రతకు బహిష్కరణ, నిరోధం అనే గోడలు నిర్మించడమే ఆధారం. అవునా కాదా? ఏదో ఒక విషయాన్ని గురించి ఆలోచించాలని మీరు కోరుకుంటున్నారు కాబట్టి మనసును అదుపులో పెట్టాలని చూస్తారు. తక్కిన ఆలోచనలన్నింటినీ బహిష్కరించాలని ప్రయత్నిస్తారు. మీ మనసుని అదుపులో వుంచడంలో, అక్కరలేని ఆలోచనలను బహిష్కరించడంలో మీకు సహాయం చేయడానికి రకరకాలైన, ధ్యానవిధానాలు వున్నాయి. జీవితాన్ని జ్ఞానము, భక్తీ, క్రియ అనే విభాగాలుగా విభజించారు. 'నా' మనస్సు స్వభావం ఫలానా ఫలానాగా వుంటుంది అని మీరు అంటారు. ఆ స్వభావానికి అనుగుణంగా ధ్యానం చేయడం మొదలుపెడతారు. ఈ భూమిని దేశాలుగా, జాతులుగా, మతాలుగా శుభ్రంగా ముక్కలు చేసి విభజించినట్లుగానే మనల్ని కూడా రకరకాల మానసిక స్వభావాలుగా విభజించుకున్నాం. ఒక్కొక్క స్వభావానికి ఒక్కొక్క ధ్యానమార్గాన్ని, ఒక ప్రత్యేక ధ్యానవిధానాన్ని కేటాయించుకున్నాం. అయితే ఈ పద్ధతులకు వెనకగా వెళ్ళి కనుక మీరు చూస్తే ప్రతిచోటా ఏదో ఒక రకమైన నియమమూ, అదుపూ పనిచేస్తున్నట్లు చూడగలుగుతారు. నియమం అంటేనే అంతర్లీనంగా అణచివేత వుంటుంది.

ఈ సమస్యను నేను వివరిస్తున్న సమయంలోనే మిమ్మల్ని మీరు దయచేసి పరిశీలించుకుంటూ వుండండి. నేను చెప్తున్న దానిని కేవలం మాటలుగా, వాగ్రూపంలో మాత్రమే తీసుకోండి. ఎందుకంటే నేను చెప్తున్నది ఏమాత్రం ముఖ్యం కాదు. ముఖ్యమైనది ఏమిటంటే మిమ్మల్ని మీరే ఆవిష్కరించుకోవడం. నేను ముందుగా చెప్పినట్లుగా మన లోపలకు ఈ ప్రయాణాన్ని మనం అందరమూ కలిసి చేస్తున్నాం. కొన్ని కొన్ని విషయాలను మీకు సూచిస్తున్నాను. అంతే సూచింపబడిన విషయాలతోనే మీరు తృప్తి చెందితే మీ మనసు ఖాళీగా, డొల్లగా, అల్పంగా వుండిపోతుంది. అల్పమైన మనసు తనలోకి తాను ప్రయాణించలేదు. అయితే ఈ మాటల ద్వారా కనుక మీ లోపలి ఆలోచనల ఎడల, మీరు వున్న స్థితి ఎడల మీకు ఎరుక కలిగినట్లయితే అప్పుడు గురువు అక్కర్లేదు.

సద్గుణాలను పెంపొందింపచేస్తాయి, ఒక ప్రతిఫలాన్ని ఇస్తాయి, ఒక అంతిమ పరమావధిని ప్రసాదిస్తాయీ అని ఆశలు జూపే ఈ ధ్యానవిధానాలు అన్నింటి వెనకా అదుపు చేసి నియమమూ, క్రమశిక్షణలో వుంచే అంశమూ ఒకటి వుంటుంది. ఉంటుంది కదూ? సంప్రదాయం చేత లేక సమాజం చేత విధించబడిన గౌరవపూరితమైన ఆ ఇరుకు మార్గంలోనే నడవాలనీ, దారి తప్పి అటూ ఇటూ ఏమాత్రం అడుగులు వేయకూడదని మనసుని క్రమశిక్షణలో పెట్టడం జరుగుతుంది.

సరే, అదుపు ఆజ్ఞల్లో అంతర్లీనంగా వున్నది ఏమిటి? దయచేసి మిమ్మల్ని మీరు పరిశీలించుకుంటూ వుండండి. ఎందుకంటే మనం అందరమూ కలిసి ఈ సమస్యను విచారణ చేస్తూ వున్నాం. మనం ఒకదానిని సమీపించబోతున్నాం. అది నేను చూడగలుగుతున్నాను. ఈ క్షణంలో మీకు ఇంకా అది కనబడటం లేదు. అందువలన దయచేసి చెప్తున్నదానిని అనుసరిస్తూ రండి. నా మాటల సమ్మోహంలో పడకండి. నా ముఖాన్ని చూసి, వ్యక్తిత్వాన్ని చూసి సమ్మోహంలో పడకుండా వుండండి. అవన్నీ అవతలకు నెట్టేయండి. అదంతా చాలా అవరివక్వత. మిమ్మల్ని మీరే పరిశీలించుకుంటూ వుండండి. అదుపులో వుంచడం అంటే అర్థం ఏమిటి? అంటే అర్థం, మీరు ఏకాగ్రత చూపదలుచుకున్న దానికీ దారి తప్పి పక్కమార్గం పట్టిన ఆలోచనలకీ మధ్య యుద్ధం జరుగుతూ వుంటుంది అని. అందుచేత ఏకాగ్రత అంటే ఒక రకమైన బహిష్కరణ. దీనిని గురించి ప్రతి పాఠశాల విద్యార్థికీ తెలుసు. ఆఫీసుల్లో పనిచేసే ప్రతి ఉద్యోగికీ తెలుసు. ఆఫీసు వుద్యోగికి ఏకాగ్రతతో వుండాలనే నిర్బంధం వుంటుంది. ఎందుకంటే అతడు ఎన్నో కాగితాలను సరిచూసి, సంతకాలు పెట్టాలి. ఎన్నో ఏర్పాట్లు చేయాలి. చర్యలు తీసుకోవాలి. ఇక పాఠశాల విద్యార్థికి ఎప్పుడూ ఉపాధ్యాయుడి భయం వుండనే వుంటుంది.

ఏకాగ్రతలో కొన్నింటి అణచివేత నిబిడీకృతమై వుంటుంది. ఉంటుంది కదూ? నాకు ఇష్టం లేనిది నాలో వుంటే దానిని నాలో నేను అణచివేసుకుంటాను. దానివైపు చూడనే చూడను. దానిలోనికి లోతుగా త్రవ్వి చూడను. అప్పటికే దానిని ఖండించివేసి నిరసించాను. ఖండిస్తున్న మనసు నిశితంగా చొచ్చుకొని పోలేదు. తను ఖండించిన దానిని అవగాహన చేసుకోలేదు.

ఇంకొకరకమైన ఏకాగ్రత కూడా వున్నది. అది ఒక విషయానికి మిమ్మల్ని మీరు అప్పగించుకున్నప్పుడు వుండే ఏకాగ్రత. ఒక చిన్న పిల్లవాడు ఆటబొమ్మలో నిమగ్నమై పోయినట్లుగా మనసు ఒక ఊహా బింబంలో నిమగ్నమైపోతుంది. ఒక ఆటబొమ్మ పిల్లలను ఎంత పూర్తిగా నిమగ్నులను కావిస్తుందో మీలో పిల్లలు వున్నవారు గమనించే వుంటారు. ఒక కొత్త బొమ్మతో ఆడుకుంటున్నప్పుడు చిన్న పిల్లవాడు చాలా ఆనందంలో మునిగి వున్నాడు. ఆ బొమ్మ అతన్ని ఎంతో ఆకర్షిస్తున్నది. ఎంతో సంతోషపరుస్తున్నది. అందుచేత ఆ క్షణంలో దానికే మొత్తం ప్రాముఖ్యం. తన ఆటని భంగపరచి

*ప్రేమ లేనప్పుడు ఆ పరమ పవిత్రమైనదీ వుండదు.*

అంతరాయం కలిగించడం పిల్లవాడికి ఇష్టం వుండదు. అతడి మనసు పూర్తిగా ఆ బొమ్మతోనే నిండిపోయి వున్నది. దీనినే మీరు 'అంకితమైపోవడం, భక్తి' అని అంటారు. ఒక చిహ్నానికో, ఒక భావానికో, దేవుడు అని మీరు పేరుపెట్టిన ఒక ఊహాబింబానికో మిమ్మల్ని పూర్తిగా అప్పగించుకోవడాన్ని 'భక్తి' అని మీరు అంటారు. బొమ్మలో పిల్లవాడు నిమగ్నమైనట్లుగా ఊహాబింబంలో మీరు నిమగ్నమైపోతారు. చాలామంది మనుష్యులకి కావలసినది చేతితోగానీ, మనసుతోకానీ తయారుచేసిన ఒక వస్తువులో పడి తమని తాము మరచిపోవడం.

ఒక ధ్యానవిధానం ద్వారా ఏకాగ్రత సాధించడం వలన చిట్టచివరకు ప్రశాంతి, పరమ యదార్థతత్వం, పరమోత్తమ సంతృప్తి లభిస్తాయని మీరు అనుకుంటారు. మీకు కావలసినది అదే. ఇటువంటి ప్రయాసా ప్రయత్నాలలో కాలక్రమేణా పెరుగుదల, పరిణామం జరుగుతాయనే ఒక భావన ఇమిడి వుంటుంది. పోనీ ఈ జన్మలో కాకపోతే మరుసటి జన్మలోనో, ఒక నూరుజన్మల తరువాతో మీరు అక్కడికి చేరుకుంటారు అనే ఒక భావన వుంటుంది. అదుపుచేయడంలో, క్రమశిక్షణలో ఇట్లా వుండాలి, అది అవ్వాలి అనే ప్రయాస తప్పకుండా వుంటుంది. ఈ ప్రయత్నం మనసుకు, ఆలోచనకు కొన్ని పరిమితులు విధిస్తుంది. ఇది చాలా సంతృప్తికరంగా అనిపిస్తుంది.

మనసుమీద, చేతనమీద కొన్ని పరిమితులు విధించడం ఎంతో తృప్తికరంగా వుంటుంది. ఎందుకంటే, మీరు ఏది అవాలని కోరుకుంటున్నారో ఆ ప్రయత్నంలో ఎంతవరకు ముందుకు సాగారో అప్పుడు మీరు చూసుకోవచ్చు. ప్రయత్నం చేస్తున్నకొద్దీ మనసు సరిహద్దులని ఇంకా ఇంకా ముందుకు నెట్టి విస్తరింపచేస్తూ వుంటారు. అయితే ఇదంతా ఇంకా ఆలోచన ప్రాంగణంలోనే జరుగుతూ వుంటుంది. ఈశ్వరుడు అనో, దేవుడు అనో, పరమాత్మ అనో మీకు ఇష్టమైన పేరు పెట్టిన ఆ స్థితిని బహుశ మీరు అందుకోవచ్చు. అయితే ఆ స్థితి కూడా ఇంకా మనసు యొక్క రంగస్థలంలోనే వుంటుంది. మీ సంస్కృతీ, మీ సమాజమూ, మీ దురాశా మొదలైనవి నిబద్ధితం చేసిన ఆ మనసు యొక్క రంగంలోనే అవన్నీ వుంటాయి.

అందుచేత, మీరు సాధన చేస్తున్న ఈ ధ్యానం అదుపుచేసే, అణచివేసే ప్రక్రియ, బహిష్కరణ, క్రమశిక్షణల ప్రక్రియ. వీటన్నింటిలోనూ ప్రయాస – ప్రయత్నం వుంటుంది. ఇది చేతనావర్తపు సరిహద్దులను విస్తరించే ప్రయత్నం. 'నేను'ని, స్వీయాన్ని విస్తరింపచేసే ప్రయత్నం. అయితే, ఇక్కడ ఇంకొక అంశం కూడా ఇమిడివుంది. అదేమిటంటే గుర్తింపు అనే ఒక ప్రక్రియ.

మీరు నాతోపాటుగా కలిసి ప్రయాణం చేస్తున్నారనే ఆశిస్తున్నాను. 'ఇది చాలా కష్టంగా వున్నది. మీరేమి మాట్లాడుతున్నారో నాకు తెలియడం లేదు' అని అనకండి. అంటే అప్పుడు మిమ్మల్ని మీరు గమనించుకోవడం లేదన్నమాట. నేను చెప్తున్నవి మేధోపరమైన ప్రతిపాదనలు కావు. సజీవమైన, ప్రాణశక్తితో నిండివున్న విషయాలు. ఊపిరితో తొణికిసలాడుతున్న విషయాలు.

ఇంతకుముందు నేను చెప్పినట్లుగా, ధ్యానం అని మీరు అంటున్నదానిలో గుర్తింపు చాలా ముఖ్యమైన అంశం. జీవితం గురించి మీకు తెలిసినది అంతా గుర్తింపుల పరంపర. బాంధవ్యం అంటే గుర్తింపు అనే ప్రక్రియ. అవునా కాదా? మీ భర్త ఎవరో లేదా మీ భార్య ఎవరో మీకు తెలుసు. అంటే వారిని మీరు గుర్తుబడతారు. గట్టిగా చూశారంటే ఈ గుర్తించడం అనేది మహా అద్భుతమైన అంశం. ఆలోచనలూ, బాంధవ్యాలూ అన్నీ కూడా గుర్తింపు అనే ప్రక్రియలోనివే. జ్ఞానం గుర్తింపు మీద ఆధారపడివున్నది. కాబట్టి ఏంజరుగుతున్నది? ధ్యానం ద్వారా అజ్ఞాతంగా తెలియకుండా వున్నదానిని గుర్తించాలని మీరు అనుకుంటారు. అది సాధ్యమా? నేను చెప్తున్నది మీకు అర్థమవుతున్నదా ? బహుశ నేను అంత స్పష్టంగా చెప్పడం లేదేమో.

మీ భార్యని, మీ పిల్లలను, మీ ఆస్తిపాస్తులను మీరు గుర్తుపడతారు. మీరు ఒక న్యాయవాది అనో వాణిజ్యవేత్త అనో ఇంజనీరు అనో మీకు గుర్తు వుంటుంది. మీరు ఫలానా అని ఒక ముద్ర, ఒక పేరు, ఒక ఇంటిపేరు వుంటాయి. విషయాలని తెలుసుకోవడం, గుర్తించడం మీ మనసు ద్వారా జరుగుతుంది. ఈ మనసు కాలానికి, ప్రయత్నానికీ ఫలితం. ఈ మనసు సద్గుణాలను అలవరచుకున్న మనసు. ఇది ఎప్పుడూ ఫలానాగా వుండాలని, ఏదో అవాలని ప్రయత్నించే మనసు. ఇదంతా కూడా గుర్తింపు అనే ఒక ప్రక్రియ. జ్ఞానం, అనుభవం వల్ల కలిగిన ఫలితం. ఈ జ్ఞానాన్ని మళ్ళీ జ్ఞాప్తికి తెచ్చుకోవచ్చును. గుర్తించ వచ్చును. అది ఎన్‌సైక్లోపిడియాలో అంటే విజ్ఞానసర్వస్వం సంపుటంలో అవచ్చు. లేదా మన లోపలా అవచ్చు.

'గుర్తించడం' అనే ఈ మాటని బాగా పరికించి చూడండి. అందులో వున్న విశేషం ఏమిటి ? దైవం అంటే ఏమిటి, సత్యం అంటే ఏమిటి అనేది కనిపెట్టాలని మీరు అనుకుంటారు. అంటే అర్థం తెలియనిదానిని గుర్తించాలని మీరు అనుకుంటున్నారు. కానీ, దేనినయినా మీరు గుర్తించగలిగితే కనుక అది అంతకు ముందు తెలిసినదే అయుంటుంది. ధ్యానాన్ని మీరు సాధన చేస్తున్నప్పుడు మీ మీ ప్రత్యేకమైన దేవుళ్ళూ, దేవతలూ స్వాప్నికదృశ్యాలలాగా మీకు గోచరిస్తుంటే అక్కడ మీరు చేస్తున్నది గుర్తింపుని దృఢపరచుకోవడం. ఈ స్వాప్నిక దృశ్యాలను మీ పూర్వరంగ నేపథ్యం, మీ నిబద్ధీకరణా చిత్రించుకొని ప్రదర్శిస్తూ వున్నాయి. క్రైస్తవులు కనుక అయితే తప్పకుండా జీసస్, మేరీలను చూస్తారు. హిందువులు శ్రీకృష్ణుడిని కానీ, ఒక డజను చేతులు వున్న దేవుడిని కాని చూస్తారు. ఎందుకంటే నిబద్ధతకు లోనయిన మనసు ఈ వూహాబింబాలను చిత్రించుకొని, ఆపైన వాటిని ఫలానాగా గుర్తిస్తుంది. ఈ గుర్తుపట్టడంవలన మీకు విపరీతమైన సంతృప్తి కలుగుతుంది. 'నేను కనుగొన్నాను, నేను దర్శించాను, నాకు తెలుసు' అని మీరు మురిసిపోతారు.

**మనసులోని వెలుగే ధ్యానం. ఆ వెలుగే క్రియకు దారి చూపుతుంది. ఆ వెలుగు లేనిదే ప్రేమ వుండదు.**

ఈ రకమైనవి మీకు అందించే ధ్యానవిధానాలు చాలా వున్నాయి. అవి ఏవీ ధ్యానం కాదని అంటున్నాను. అది మిమ్మల్ని మీరే సమ్మోహంలో ముంచుకోవడం, దానిలో గాఢత వుండదు. పదివేల సంవత్సరాలపాటు మీరు ఒక పద్ధతిని పట్టుకొని సాధన చేసినా సరే. కాలం అనే రంగస్థలంలోనే ఇంకా వుండిపోతారు. మీ జ్ఞానపు సరిహద్దుల లోపలే, మీ నిబద్ధీకరణ సరిహద్దుల లోపలే వుండిపోతారు. మీరు చిత్రించుకొని ప్రదర్శించు కుంటున్న వాటిని గుర్తించే ఆ రంగపు సరిహద్దులను మీరు ఎంత దూరానికి నెట్టి విస్తరించుకున్నా కూడా అది నిస్సందేహంగా ధ్యానం కాదు. ఆ పేరును దానికి మీరు పెట్టుకున్నారు. అంతే. మీరు చేస్తున్నది కేవలం మీ స్వీయాన్ని, 'నేను'ను గట్టిగా బలపరచుకోవడం. 'నేను' అంటే ఏమీ లేదు. సంబంధించిన జ్ఞాపకాలతో తయారుచేసుకున్న ఒక మూట. ధ్యానం అని మీరు అంటున్న ఈ దీని ద్వారా ఆలోచించేవాడికీ ఆలోచనకూ, పరిశీలకునికీ పరిశీలితానికీ మధ్య సంఘర్షణను ఎప్పటికీ కొనసాగేలా మీరు పోషిస్తున్నారు. అంటే అక్కడ పరిశీలకుడు తను పరిశీలిస్తున్న దానిని ఎప్పుడూ గమనిస్తూ, నిరాకరిస్తూ, అదుపుచేసస్తూ, దానిని సరిదిద్దుతూ వుంటాడు. ఈ ఆట ఆడటానికి పాఠశాల విద్యార్థి కూడా సరిపోతాడు. ఈ మీరు చేస్తున్నదానికి ధ్యానంతో సంబంధం లేదని నేను అంటున్నాను. కానీ తెల్లగడ్డాలు పెంచుకున్నవారంతా మీరీ విధంగానే 'ధ్యానం చేయాలి' అని నొక్కి చెప్తుంటారు. యోగులు, స్వాములు, సన్యాసులు, ఈ లౌకిక ప్రంచాన్ని త్యజించి వెళ్ళిపోయి గుహల్లో కూర్చునే వారందరూ కూడా ఇందులో చిక్కుకొని పోయి వున్నారు. తమ తమ స్వాప్నిక దృశ్యాలను వెంటాడుతూ కూర్చుంటారు. అవెంత వుత్కృష్టమైనవి అయినా కూడా అదంతా తమ తృష్ణకు దాస్యం చేసే ప్రక్రియ, స్వీయతృప్తిని సాధించుకొనే ప్రక్రియా మాత్రమే అవుతుంది.

అప్పుడు ధ్యానం అంటే ఏమిటి ? ఆలోచించేవాడు లేనప్పుడు మాత్రమే మీరు ధ్యానస్థితిలో వుంటారని నిస్సందేహంగా చెప్పవచ్చు. అంటే ఆలోచనకు, 'నేను'కు, స్వీయానికి కేంద్రం అయినటువంటి స్మృతికి మీరు చోటు ఇవ్వనప్పుడు. చేతనావర్తపు సరిహద్దులను గీస్తున్నది ఈ కేంద్రమే. అది ఎంత విశాలంగా విస్తరించుకున్నా, ఎంత సద్గుణశీలి అయినా, మానవాళికి సేవ చేయాలని ఎంతగా ప్రయత్నిస్తున్నా కూడా అది ధ్యానస్థితిలో మాత్రం వుండలేదు. ఎరుకగల ఆ స్థితికి – అదే ధ్యానం అంటే – ఎప్పుడు మీరు రాగలరంటే, ఏవిధమైన నిరసనా లేనప్పుడు. అణచివేయడంకోసం, అదుపు చేయడంకోసం ప్రయత్నం ఏమాత్రం లేనప్పుడు. ఈ ఎరుక ఎటువంటిదంటే అందులో ఒకటి ఎన్నిక చేసుకోవడం అనే ప్రసక్తి వుండదు. ఎందుకంటే, ఎన్నిక అనగానే అందులో ఇచ్ఛాసంకల్పమూ, దాని ప్రయత్నమూ వుంటాయి. ఒకటి మరొకదానిపై ఆధిక్యత చలాయించడమూ, అదుపు చేయడమూ అంతర్లీనంగా వుంటాయి. ఇటువంటి ఎరుకలో చేతనకు పరిమితులు వుండవు. ఆ కారణంగా సంపూర్ణమైన సావధానతను ఇవ్వగలుగుతుంది. ఇది ఏకాగ్రత కాదు. సావధానశీలతకూ ఏకాగ్రతకూ చాలా పెద్ద అంతరం వున్నది. ఒకే కేంద్రం నుండి మీరు సావధానత చూపుతే అది సావధానత కాదు. ఏకాగ్రత ఒక కేంద్రం నుండి చూపుతారు. అయితే, సావధానత అంటే అర్థం అఖండంగా వుండే ఒక పరిపూర్ణత్వపు స్థితి. అందులో పరిశీలించ బడుతున్న అంశంనుండి విడిగా పరిశీలకుడు వుండడు.

ఈరోజు మనం మాట్లాడుకున్న ఈధ్యానం అంటే నిజంగా ఏమిటంటే, తెలిసిన వాటినుండి మనసును విడుదల చేయడం. దీని అర్థం మీ ఇంటికి దారి ఎటో మరచిపోవడం అని కాదు. మీ వుద్యోగం నిర్వహించడానికి అవసరమైన సాంకేతిక విజ్ఞానాన్ని వదిలేసుకోవాలనీ కాదు. అటువంటివి కాదు. దీని అర్థం ఏమిటంటే, మనసుని తన నిబద్ధీకరణం నుండి, అనుభవాల నేపథ్యం నుండి విడిపించాలని. వీటిలో నుండే మనసు చిత్రణలు చేసుకోవడమూ, గుర్తించడమూ చేస్తూ వుంటుంది. మనసు ఆర్జన, సంతృప్తి, గుర్తింపు అనే ప్రక్రియలనుండి కూడా తనను విముక్తం చేసుకోవాలి. అజ్ఞేయమైనదానిని, యదార్థమైనదానిని, కాలరహితమైనదానిని మీరు గుర్తించలేరు. ఆహ్వానించనూ లేరు. మీ స్నేహితులని మీరు ఆహ్వానించ గలుగుతారు. సద్గుణాలని ఆహ్వానించ గలుగుతారు. మీరే సృష్టించుకున్న దేవుళ్ళనీ ఆహ్వానించగలుగుతారు. వారిని ఆహ్వానించి మీ అతిథులుగా వారిని వుంచుకోవచ్చు. కానీ, మీరు ఏం చేసినా సరే, ధ్యానం చేయండి, త్యాగాలు చేయండి, సద్గుణాల పోగులవండి. కానీ అప్రమేయమైనదానిని, దేనిని గురించి మీకు ఏమీ తెలియదో ఆ దానిని మీరు ఆహ్వానించలేదు. సద్గుణాల ఆచరణ ప్రేమను సూచించదు. అది తృప్తిచెందాలనే మీ కోరిక కారణంగా వచ్చిన ఫలితం.

అందుచేత, ధ్యానం అంటే మనసుని తెలిసిన వాటినుండి విముక్తం చేయడం. ఈ స్వేచ్ఛలోకి మీరు ఎప్పుడో రేపు ప్రవేశించడం కాదు. తక్షణమే, ఇప్పుడే ప్రవేశించాలి. ఎందుకంటే, కాలం ద్వారా కాలరహితాన్ని మీరు చేరలేరు. కాలరహితం ద్వైధీభావం కాదు. ప్రతి మూలమూలల నుండీ కాలరహితపు గుసగుసలు వినవస్తూనే వున్నాయి. ప్రతి పచ్చని ఆకుకిందా అది వున్నది. అది వివృతంగా వున్నది. సన్యాసుల కోసం కాదు. తమని తాము అణచివేసుకొని, ఆర్ద్రవిహీనంగా తయారయిన, ఏ గాఢమైన ఆసక్తీలేని మనుష్యులకోసమూ కాదు. ప్రతి ఒక్కరికోసమూ తెరచి వున్నది. క్షణక్షణమూ మనసు ధ్యానస్థితిలో వుంటున్న ప్రతి ఒక్కరికోసమూ. అటువంటి మనసు మాత్రమే అజ్ఞేయమైన దానిని స్వీకరించగలుగుతుంది.

(డిసంబరు 13, 1959: మద్రాసు)

ధ్యానం లేని హృదయం ఎడారిగా మారిపోతుంది. బంజరు భూమి అయిపోతుంది.

## వార్షిక సమావేశం

## – గేదరింగ్

ఈ సంవత్సరం జరగబోయే వార్షిక గేదరింగ్ పూనా వద్ద వున్న సహ్యాద్రి విద్యాలయం ఆవరణలో జరగబోతున్నది. కృష్ణమూర్తి ఫౌండేషను వారు ప్రతి ఏటా నిర్వహించే ఈ సమావేశానికి హాజరవ్వాలనుకునేవారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఈ నవంబరు 20 (గురువారం) నుండి నవంబరు 23 (అదివారం) వరకు ఈ సభలు జరుగుతాయి.

తమ తమ జీవితాలను గురించి విచారణ చేసి శోధించాలనుకునేవారికి, కృష్ణమూర్తి బోధనలను లోతుగా అధ్యయనం చేయదలచుకున్నవారికి ఈ గేదరింగ్‌కు రావడం ఒక మంచి అవకాశం కల్పిస్తుంది. ఏ ప్రాంతపు వారైనా సరే ఈ గేదరింగ్‌లో పాల్గొనవచ్చును.

ఈ సందర్భంగా ప్రముఖుల ప్రసంగాలు వుంటాయి. వీడియో ప్రదర్శనలు వుంటాయి. ప్రశ్నలు – సమాధానాలకు కూడా సమయం కేటాయించబడుతుంది. సభ్యులు చిన్న చిన్న బృందాలుగా ఏర్పడి చర్చల్లో, సంభాషణల్లో పాల్గొనడానికి వీలు కల్పించబడుతుంది.

ఈ సంవత్సరం సమావేశంలో ప్రధాన విషయం ఏమిటి, హాజరవ్వదలుచుకున్నవారు చెల్లించవలసిన రుసుము వగైరా వివరాలు త్వరలో వెలువడుతాయి. లేదా ఈ చిరునామాకు వ్రాసి తెలుసుకోవచ్చును.

**సహ్యాద్రి స్కూలు,**
**కృష్ణమూర్తి ఫౌండేషను ఇండియా,**
తివాయి హిల్, రాజ్‌గురు నగర్
(డిస్ట్రిక్ట్) పూనె - 410513.
ఫోన్లు : 02135 - 306100, 288442/3;
E-mail : sahyadrischool@gmail.com
Website : www.sahyadrischool.org

'అంతరంగయాత్ర' చదవవాలనని ఆసక్తి వున్నవారి చిరునామాలు పంపండి. ఉచితంగా పంపుతాము. పోస్టు కార్డు పైకాని, ఇమెయిల్ ద్వారా గాని చిరునామాలు పంపవచ్చును.

## రెండు రకాల స్మృతులు

**ఒకరి ప్రశ్న :** బాహ్య ప్రపంచానికి సంబంధించిన వాస్తవాలు, గణాంకాలు మొదలైన స్మృతులు మనకు అవసరం; ఇవి తప్పనిసరికూడా. ఇవి ఒక రకం. వీటికి పూర్తి భిన్నంగా మానసిక స్మృతులు అని అనబడేటటువండివి మరొక రకం. ఈ రెండు రకాల స్మృతులూ వున్నాయంటారా?

**కృష్ణమూర్తి :** స్మృతి అంటే నిలవ చేసుకున్న అనుభవం. నిలవ చేసుకున్నది తెలిసినదైవుంటుంది. తెలిసినది ఎప్పుడూ గతమే. వాస్తవాలకు, గణాంకాలకు సంబంధించిన స్మృతులూ మానసికమైన స్మృతులూ అనే రెండు రకాల స్మృతులున్నాయని మనం తెలుసుకోవాలి కదూ? తప్పనిసరి ఐనవీ ఆవశ్యకమైనవీ అయిన ఆ మొదటి రకం స్మృతులు లేకుండా మనం ఒకరితో ఒకరం సంభాషించుకోలేము కదూ? మానసికమైన స్మృతులను నిలవ చేసుకొని, వాటిని వదలకుండా పట్టుకొని వుంచుకుంటాం. ఈ విధంగా స్వీయానికి – నేనుకు ఎడతెగని కొనసాగింపు ఇస్తున్నాం. అందుచేత ఈ స్వీయం, గతం ఎప్పుడూ వృద్ధి చెందుతూ వుంటుంది. ఎప్పుడూ కూడబెట్టుకుంటూ, తనను తాను పెంచుకుంటూ వుంటుంది. అంతమవవలసినది ఈ కూడబెట్టుకుంటున్న స్మృతుల నిలవలు, ఈ స్వీయం. మనం చనిపోవలసినది ఈ నిలవల ఎడల.

(ఒహాయి, 1945, 10వ ప్రసంగం)

## రెండు రకాల చర్యలు

**ఒకరి ప్రశ్న :** రెండు రకాల చర్యను గురించి మీరు చెప్పారు. పరిసరాలకు ప్రతిచర్య చూపడం ఒకటి. ఇది సంఘర్షణను సృష్టిస్తుంది. రెండు – పరిసరాలలోనికి దృష్టి సారించి చూసి గ్రహించడం. దీని వలన సంఘర్షణ వుండదు. మొదటిది నాకు అర్థమైంది. కానీ ఈ రెండవది అర్థమవలేదు. పరిసరాలోనికి దృష్టి చొచ్చుకొని పోవడం అంటే ఏమిటి?

**కృష్ణమూర్తి :** ఒక పరిసర వాతావరణానికి మీరు ప్రతిచర్య చూపుతారు. అది సంఘర్షణను పుట్టిస్తుంది. ఆ సంఘర్షణ నుండి తప్పించుకోవడానికి మీరు మరొక వాతావరణాన్ని సృష్టించుకుంటారు. ఇది శాంతిని తీసుకొస్తుందని మీరు ఆశిస్తారు. ఇది ఏమిటంటే – వాతావరణం మారవచ్చును అనే సంగతి అర్థచేసుకోకుండా వాతావరణం పై మీరు చర్య తీసుకోవడం. ఇది ఒక రకమైన చర్య. ఎక్కువమంది ఇటువంటి క్రియలో – చర్యలో చిక్కుకొని పోయి వుంటారు.

ఇక మరొక రకమైన చర్య వున్నది. అది వాతావరణాన్ని అవగాహన చేసుకొని చర్య జరపడం. అయితే దీని అర్థం మొదట అవగాహన చేసుకోవాలనీ ఆ తరువాత చర్య చేయాలనీ కాదు. అవగాహన చేసుకోవడమే చర్య – అవగాహన చేసుకోవడంలోనే చర్య వుంటుంది అని అర్థం. అంటే అక్కడ లాభనష్టాలు లెక్కించి బేరీజు వేయడం, పైపైన మార్పులు చేయడం, సర్దుబాట్లు వుండవు. ఇవి అన్నీ స్మృతులు చేసే పని. పరిసరాలను – వాతావరణాన్ని అందులో గల ముఖ్యాముఖ్యతలను అన్నింటినీ తెలివి అనే దర్పణంలో వున్నవి వున్నట్లుగా మీరు చూడాలి. అప్పుడు ఆ అప్రయత్నంగా స్వతఃసిద్ధంగా జరిగే చర్య – క్రియలో స్వేచ్ఛ వుంటుంది.

*Published in August, December, April*
*Registered with The Registrar of Newspapers*
*for India under No. TNTEL/2006/19442*

*PERIODICAL*

*If undelivered please return to:*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old 64, 65) Greenways Road
Chennai - 600 028. Tel: 24937803 / 24937596
E-mail : publications@kfionline.org
Websites : www.kfionline.org / www.jkrishnamurti.org

*Published by Dr. V. Aravind on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old 64, 65) Greenways Road, Chennai - 600 028.*
*Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27, Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*